• బాలాత్రిపుర సుందరిగా భద్రకాళి



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వరంగల్‌లోని భద్రకాళీ అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. – వరంగల్

# పూటకో మాట.. గడికో అబద్ధం

- గ్రూప్-2పై వారివి రెండు నాల్కలు
- అప్పుడేమో వాయిదా కోసం ఆందోళనలు
- కోదండరాం మౌనదీక్ష.. ప్రవీణ్ నిరసన దీక్ష
- ప్రజాస్వామిక పోరాటం చేస్తున్నట్టు రేవంత్ ప్రకటన
- అసెంబ్లీసాక్షిగా కోరిన కాంగ్రెస్ నేత దుద్దిళ్ల
- ఇప్పుడేమో కొత్తడ్రామాలు.. గాలి మాటలు
- యువతి ఆత్మహత్యపై శవ రాజకీయాలు
- వ్యక్తిగత కారణాలతో మరణిస్తే గ్రూప్-2కు ఆపాదించే కుట్ర

| అప్పుడు | ఇప్పుడు |
| --- | --- |
| • రేవంత్<br>గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి. లక్ష లాదిమంది విద్యార్థుల విన్నపాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. గ్రూప్-2 వాయిదాకు కాంగ్రెస్ పోరాటం చేస్తుంది. ఇక పైనా కొనసాగిస్తుంది.<br>-11 ఆగస్టు 2023న రేవంత్‌రెడ్డి | • రేవంత్<br>పరీక్షల రద్దుతో యువత ఆత్మహత్య లకు పాల్పడుతున్నది. గ్రూప్-2 రద్దుతో యువతి ఆత్మహత్య చేసుకో వడం బాధాకరం. ఆమె ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత.<br>-14 అక్టోబర్ 2023న రేవంత్‌రెడ్డి |
| • ఆర్‌ఎస్ ప్రవీణ్<br>గ్రూప్-2 పరీక్ష తేదీని మూడు నెలలు పొడిగించాలి. సీఎం కేసీఆర్ తక్షణమే నిరు ద్యోగులపై దృష్టిసారించి వారికి న్యాయం జరిగేలా చూడాలి. వారికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేదిలేదు.<br>-12 ఆగస్టు 2023న నిరసన దీక్షలో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ | • ఆర్‌ఎస్ ప్రవీణ్<br>హైదరాబాద్ నడిబొడ్డున నిరుద్యోగి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. పరీక్ష వాయిదా వల్లే యువతి ఆత్మహత్య చేసుకున్నది. దీనికి ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీలదే బాధ్యత.<br>-14 అక్టోబర్ 2023న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ |
| • కోదండరాం<br>ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదు. గ్రూప్-2ను వాయిదా వేయడం కుదరదని చెప్పడం న్యాయం కాదు. ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ఆలోచిం చాలి. గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి. అభ్యర్థులకు ప్రిపరేషన్ కోసం మరికొంత సమయం ఇవ్వాలి.<br>- 12 ఆగస్టు 2023న మౌనదీక్షలో కోదండరాం | • కోదండరాం<br>ప్రభుత్వం తీరు సరికాదు. పరీక్షను వాయిదా వేయడంతోనే హైదరాబా ద్‌లో యువతి ఆత్మహత్య చేసుకున్నది. ఇదెంతో బాధాకరం. ఈ ఘటన ప్రభుత్వం వల్లనే జరిగింది. యువతి ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి.<br>- 14 అక్టోబర్ 2023న ప్రత్యేక వీడియోలో కోదండరాం |

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): 'నిజం చెప్పులేసుకునేలోపు అబద్ధం ప్రపంచమంతా తిరిగొస్తుంది' అన్న మాట ఇవాళ తెలంగాణలోని ప్రతిపక్షాలకు సరిగ్గా సరిపోతుంది. తమకు అలవాటైన రీతిలో అర్ధసత్యాలు, అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టడానికి విపక్షాలు రోజుకో పగటి వేషం వేస్తున్నాయి. ఎప్పటిలాగే రెండు నాల్కల ధోరణితో పూటకో మాట.. గడికో అబద్ధం ఆడుతూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఉద్యమ నినాదమైన నీళ్లు, నిధులను ఇప్పటికే సాధించుకున్న తెలంగాణ.. నియామకాలపై దృష్టి సారించింది. రాష్ట్రంలో ఒకేసారి 80,039 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. అప్పటి నుంచి ప్రతిపక్షాలకు కండ్లలో జిల్లేళ్లు మొలిసినయ్. రాష్ట్రంలో రోజురోజుకూ బలహీన పడటం, పార్టీ క్యాడర్ చేజారిపోతుండటం, ప్రజల్లో నమ్మకం సన్నగిల్లడం.. వెరసి కునుకులేకుండా చేశాయి. ఎలాగైనా యువతను ప్రభుత్వానికి దూరం చేయాలనే కుట్రకు తెరలేపారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా నోటిఫికేషన్లు ఇస్తుంటే, మరోవైపు ప్రతిపక్షాలు మాత్రం ఆ పరీక్షలను ఎలా అడ్డుకోవాలనే కుట్రలకు తెరలేపాయి. ఒకవైపు న్యాయస్థానాల్లో కేసులు వేయిస్తూ.. మరోవైపు అభ్యర్థులను తప్పుదోవ పట్టించే పనిలో పడ్డాయి.

### గ్రూప్-2పై గడికో మాట

తెలంగాణలో ఉద్యోగ నియామకాలను సకాలంలో పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా పరీక్షలకు తేదీలను ప్రకటించింది. అందులో భాగంగానే ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష జరగాల్సి ఉన్నది. ఒకవైపు రాష్ట్రంలో ఉద్యోగ భర్తీ ప్రక్రియ శరవేగంగా సాగుతుండటం, మరోవైపు యువత ప్రభుత్వానికి మరింత దగ్గర కావడాన్ని జీర్ణించుకోలేని విపక్షాలు కొత్త డ్రామాకు తెరలేపాయి. గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని నానా రాద్ధాంతం చేశాయి. అమాయక యువతను ఉసిగొల్పి ఉద్యమాలకు దిగాయి. గ్రూప్-2 పరీక్షను రద్దు చేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి బహిరంగ ప్రకటన విడుదల చేశారు. కోదండరాం మౌన దీక్ష చేపట్టారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరసన దీక్షకు దిగారు. టీఎస్‌పీఎస్సీ కార్యాలయ ముట్టడికి కోదండరాం, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ హాజరయ్యారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు అసెంబ్లీ సాక్షిగా గ్రూప్-2ను వాయిదా వేయాలని కోరారు. బీజేపీ నేత బండి సంజయ్ మొదటి నుంచి పరీక్షలపై నానా యాగీ చేస్తున్నారు. గ్రూప్-2ను వాయిదా వేయాలని మీడియా వేదికగా మొసలి కన్నీరు కార్చారు. అయినప్పటికీ గ్రూప్-2 పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది.

### ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్నా వినకుండా..

గ్రూప్-2ను వాయిదా వేయాలని టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశమున్నదని, వాయిదా వేస్తే ఇబ్బంది అవుతుందని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి తనను కలిసి అభ్యర్థులకు నచ్చజెప్పారు. అయినా విపక్షాలు యువతను రెచ్చగొడుతూనే ఉన్నాయి. చివరికి ప్రభుత్వం గ్రూప్-2 పరీక్షను వాయిదా వేసింది. నవంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించింది. ఈలోపే ఎన్నికల షెడ్యూల్ రావడం, 3నే నోటిఫికేషన్‌తో పాటు నామినేషన్ల స్వీకరణ ఉండటంతో పరీక్ష వాయిదా అనివార్యమైంది. 50 వేలమంది సిబ్బంది అవసరం ఉండటంతో పరీక్ష నిర్వహణ కష్టమని కలెక్టర్లు కమిషన్‌కు తెలపడంతో గ్రూప్-2ను వాయిదా వేస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. జనవరి 6, 7న నిర్వహిస్తామని తెలిపింది. అప్పుడేమో పరీక్షను వాయి దా వేయాలని నానా యాగీ చేసిన విపక్షాలు.. ఇప్పుడేమో యువతి వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటే దానిని గ్రూప్-2కు ముడిపెట్టి కొత్త డ్రామాకు తెరలేపారు. ఈ నేపథ్యంలో శవాల మీద పేలాలు ఏరుకోవడం ఇకనైనా మానుకోవాలని అభ్యర్థులు వారికి హితబోధ చేస్తున్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల సత్కార సభలో మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్

## 1.3 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం

- మరో 85 వేల పోస్టులకు నోటిఫికేషన్లు
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్
- ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి సత్కారం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 15: బీఆర్‌ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో 1.3 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. మరో 85 వేల పైచిలుకు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. స్వరాష్ట్రంలో ఇక్కడి యువత కల సాకారమవుతుందని అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కృషి భవన్‌లో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2018 నుంచి నిర్వహిస్తున్న వారధి స్టడీ సెంటర్‌లో కోచింగ్ తీసుకొని ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల సత్కార సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నదని చెప్పారు. ఇటీవలే పెద్దమొత్తంలో పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ, టీఆర్టీ ద్వారా నోటిఫికేషన్లు జారీ చేసిందని పేర్కొన్నారు. నిరుపేద నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారధి స్టడీ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్నవారిలో 287 మంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మేయర్ వై సునీల్ రావు, ప్రతిమ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ హరిణి, డైరెక్టర్ డాక్టర్ ప్రతీక్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు పొన్నం అనిల్ గౌడ్, ఎస్సీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు జక్కుల నాగరాజు పాల్గొన్నారు.

## 'ఆరోగ్యశ్రీ'తో 90 లక్షల కుటుంబాలకు లబ్ధి

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఆరోగ్య శ్రీ సేవలను మరింత విస్తరిస్తామని, పరిధిని రూ.15 లక్షలకు పెంచుతామని బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల కుటుంబాలు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నాయి. 3 కోట్లమందికిపైగా ఆరోగ్యశ్రీ వర్తిస్తున్నది.








